నమస్తే తెలంగాణ
వరంగల్
3 | వరంగల్, శనివారం 5 అక్టోబర్ 2024 | WARANGAL



అన్నపూర్ణేశ్వరి అలంకరణలో భద్రకాళీ అమ్మవారు

# అన్నపూర్ణేశ్వరిగా భద్రకాళీ

## రెండోరోజు వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

వరంగల్, అక్టోబర్ 4 : ప్రసిద్ధ భద్రకాళీ దేవాలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. రెండో రోజైన శుక్రవారం అమ్మవారు అన్నపూర్ణేశ్వరిగా దర్శనమిచ్చారు. ఉదయం మకర, సాయంత్రం చంద్రప్రభ వాహనంపై ఊరేగారు. మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయభాస్కర్, నన్నపునేని నరేందర్, తోగుంట ఆశ్రమం పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతి స్వామి దర్శించుకున్నారు. వారికి ఆలయ ఈవో శేషుభారతి, ప్రధాన అర్చకులు భద్రకాళీ శేషు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

**కాళేశ్వరంలో బ్రహ్మచారిణిగా..**

కాళేశ్వరం : కాళేశ్వరంలోని శుభానంద (పార్వతి), మహాసరస్వతి ఆలయాల్లో అమ్మవారు శుక్రవారం బ్రహ్మచారిణి అలంకరణలో దర్శనమిచ్చారు. ఉదయం గణపతి, లలితార్చన పూజలు, పంచమి విశేష పూజ, గణపతి, నవగ్రహ, రుద్ర పంచసూక్త హోమం నిర్వహించారు. సాయంత్రం మూలమంత్ర చండీహోమం జరుగగా, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



కాళేశ్వరం : బ్రహ్మచారిణి అలంకరణలో పార్వతి మాత

## రేవంత్‌వి బ్రోకర్ మాటలు..



రైతులకు ఇచ్చిన మాట తప్పి బ్రోకర్ మాటలు మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డికి ఇష్టమొచ్చినట్లు చెప్పాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మండిపడ్డారు. మాజీ మంత్రి హరీశ్‌రావు భయానికే 40శాతం రుణమాఫీ చేశారని రైతులందరికీ రుణమాఫీ చేసేవరకూ పోరాటం ఆగదన్నారు. పంటలకు రూ.500ల బోనస్ అని ఇప్పుడు సన్న వడ్లకు అని చెబుతున్నారని ఇలా అబద్ధాలు, బ్రోకర్ మాటలు చెప్పి ముఖ్యమంత్రి అయ్యాడని సీఎం అయిన తర్వాత కూడా అలాగే ప్రవర్తిస్తున్నాడని ధ్వజమెత్తారు. కేసీఆర్ హయాంలో ఎడారిగా ఉన్న పాలకుర్తి నియోజకవర్గంలో 365 రోజులు పుష్కలంగా నీళ్లు, 24 గంటల విద్యుత్, అదునుకు రైతుబంధు, పంటలకు గిట్టుబాటు ధర వచ్చేవని ఎర్రబెల్లి గుర్తుచేశారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఎంతో అభివృద్ధి చేసుకున్నామని తండాలకు రోడ్డు సౌకర్యం కోసం రూ.200 కోట్ల అభివృద్ధి నిధులిస్తే ములుగుకు తీసుకెళ్లారన్నారు. అలాగే 100 పడుకల దవాఖాన, సీసీరోడ్లు, వాటర్‌ట్యాంక్ పనులకు శంకుస్థాపన చేసినా ఇప్పటికీ పనులు ప్రారంభం కాలేదన్నారు. కొంతమంది పార్టీ మారినంత మాత్రాన నష్టం ఏమీలేదన్నారు. హరీశ్‌రావు రైతుల కోసం ఎంతో పోరాటం చేస్తున్నాడడని రుణమాఫీ అయ్యేదాకా ముఖ్యమంత్రిని వదలిపెట్టేది లేదన్నారు. *– మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు*

## మాఫీ అయ్యేదాకా విశ్రమించొద్దు



ప్రమాణ స్వీకరం చేసిన రెండు నిమిషాల్లో రుణమాఫీ అమలు చేస్తామని చెప్పి 10 నెలలైనా ఆ హామీని నెరవేర్చకపోవడం దురదృష్టకరం. 6 గ్యారెంటీల్లో ఒకటి మినహా మిగిలినన్నీ తుంగలో తొక్కి రైతుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో దుర్మార్గ పాలన నడుస్తున్నదని రైతులందరూ కదం తొక్కి రుణమాఫీ అయ్యేవరకూ విశ్రమించవద్దు. ఏడారిగా ఉన్న ప్రాంతాల్లో రైతులకు సాగునీరు అందించిన మహానుభావుడు కేసీఆర్. దండగ అన్న వ్యవసాయాన్ని పండగ చేసి రైతులకు భరోసా కల్పించారు. ఈ దుర్మార్గ పాలన అంతమొందించేందుకు రైతులంతా పోరాటాలకు సిద్ధం కావాలి. *– సిరికొండ మధుసూదనాచారి, శాసనమండలి ప్రతిపక్ష నేత*

## బోనస్ అని బోగస్ మాటలు చెప్పిండు



అధికారంలోకి రాక ముందు అన్ని పంటలకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి ఇపుడు సీఎం బోగస్ మాటలు చెబుతున్నడు. డిసెంబర్ 9 పోయింది ఇప్పుడు సన్నవడ్లు అంటున్నడు. మోసం చేయడం తప్ప ఏమీ లేదు. రూ.2 లక్షల రుణమాఫీ మొదట్లో రూ. 42 వేల కోట్లు అన్నడు. కేబినెట్‌లో రూ.31 వేల కోట్లన్నడు. అ తర్వాత అసెంబ్లీలో రూ.26 వేల కోట్లు అన్నడు. చివరకు రూ.7, 8 వేల కోట్లు ఇయ్యలే. ఇచ్చిన మాటకు కట్టుబడి రుణమాఫీ చేయాలని హరీశ్‌రావు పోరాటం చేయకపోతే ముఖ్యమంత్రి రుణమాఫీ ప్రక్రియ మొదలు పెట్టకపోయేది. పైగా ఆయనపైనే తిట్ల దండకం చేస్తున్నాడు. చిత్తశుద్ధి ఉంటే ముందు చెప్పినట్లు అందరికీ రూ.2లక్షల రుణమాఫీ చేయాలి. కేసీఆర్ ప్రభుత్వంలో ప్రపంచా దేశాల్లో ఎక్కడా లేని విధంగా రైతుబంధు ద్వారా 11 సార్లు రూ.72వేల కోట్లు అందించిన చరిత్ర కేసీఆర్‌ది. *– పల్లా రాజేశ్వర్‌రెడ్డి, జనగామ ఎమ్మెల్యే*

# నెలలు గడుస్తున్నా నష్టపరిహారం ఏమైంది?

- రైతులు చనిపోయతున్నా కనికరించవా?
- ఎన్నికల హామీలన్నీ ఎటుపోయాయి
- కేసీఆర్‌ది రైతు గుండె.. రేవంత్‌ది రాతిగుండె
- రైతులెవరూ అధైర్యపడొద్దు
- రుణమాఫీ, రైతుభరోసా వచ్చేదాకా బీఆర్‌ఎస్ అండగా ఉంటుంది
- తొర్రూరు మహాధర్నాలో మాజీ మంత్రి హరీశ్‌రావు



మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో జరిగిన రైతు ధర్నాలో పాల్గొన్న రైతులు, మాట్లాడుతున్న హరీశ్‌రావు







# రేవంత్.. వరద సాయమేదీ?

## రూ. 50 వేలే మాఫీ కాలే..



నర్సింహులపేట : కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ. రెండు లక్షల రుణమాఫీ చేస్తామంటే ఆశపడి ఓటేసిన. నాకు రెండెకరాల భూమి ఉంది. రూ.50,000 బ్యాం కు అప్పు ఉంటే అదే మాఫీ కాలేదు. కాంగ్రెస్ సర్కార్ వచ్చినప్పటి నుంచి రెండు పంటలు సాగు చేసినా ఇప్పటివరకు రైతుబంధు రాలేదు. ముఖ్యమంత్రిది ఒకమాటైతే.. మంత్రులది మరోమాట ఉంటాంది. పనులు వదులుకొని మాఫీ పైసల కోసం బ్యాంకు, వ్యవసాయ అధికారుల చుట్టు తిరిగినా ఎవరూ సమాధానం చెప్పడం లేదు. కేసీఆర్‌ను ఓడగొట్టి తప్పు చేసినం. రుణ మాఫీ కాలేదు. రైతుబంధు రాలేదు. మా కోసం బీఆర్‌ఎస్ వాళ్లు పోరాటం చేస్తుంటే ఇక్కడకు వచ్చిన.

*– జాటోత్ జోగ్యా, ఎల్బీ తండా, చిన్నవంగర*

## సీఎం, మంత్రుల మాటలకు పొంతన లేదు



సీఎం రేవంత్‌రెడ్డి రైతులందరికీ రుణ మాఫీ చేశామంటే.. మంత్రి తుమ్మల మాత్రం సగం మందికే ఇచ్చామంటారు. అసలు ఎవరి మాట నిజమో రైతులు అర్థం చేసుకోవాలి. రైతుబంధువు కేసీఆర్ అయితే ప్రజలందరినీ కష్టాల్లో నెట్టేసిన రైతుల ద్రోహి రేవంత్‌రెడ్డి. కొవిడ్ కష్ట కాలంలో మంత్రులు, ఎమ్మెల్యేల జీతాలను నిలిపేసి రైతులకు రైతుబంధు అందించిన మహానాయకుడు కేసీఆర్ అయితే అందరినీ నట్టేట ముంచిన వ్యక్తి రేవంత్‌రెడ్డి. కేసీఆర్ కంఠంలో ప్రాణం ఉన్నంతవరకు రైతుబంధు ఆపేదే లేదన్నాడు. ఇప్పుడున్న సీఎం రైతులు కౌలు రైతులకు, రైతు కూలీలకు డబ్బులు ఇస్తానని మోసం చేసిండు. రైతులంటే ప్రేమ లేదా మీకు. బిడ్డా ఇలా చేస్తే ఊరుకోం. రైతుకు ఎంత అప్పు ఉన్నా 2లక్షలు బ్యాంకు ఖాతలో జమ చేయాల్సిందే. కేసీఆర్‌ను, బీఆర్‌స్‌ను తిట్టడమే లక్ష్యంగా పెట్టుకున్నావు. గాలికి ఏది పడితే అది మట్లాడుడితే ఖబడ్దార్ అని హెచ్చరిస్తున్నాం. మహిళా జాతి తలదించుకునేలా ఓ మంత్రి చౌకబారు మాటలు మాట్లాడుతోంది. నోరు మూసుకొని ముందు ప్రజా సమస్యలపై దృష్టిపెడితే బాగుంటుంది.

*– సత్యవతి రాథోడ్, మాజీ మంత్రి*

## రైతులకు పరిహారం ఇవ్వకపోవడం బాధాకరం



రుణమాఫీ, రైతుబంధుపై సీఎం, మంత్రులకు అవగాహన లేదు. కొవిడ్ సమయంలో కేసీఆర్ రైతుబంధు అందరికీ ఇచ్చాడు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికీ రైతుబంధు ఇవ్వలేదు. కానీ రుణమాఫీ చేస్తామని బ్రోకర్ మాటలు మాట్లాడుతున్నాడు. కేసీఆర్‌ను ఓడించి తప్పు చేశామని రాష్ట్రంలోని మహిళలు, రైతు లు ప్రజలు బాధపడుతున్నరు. రుణమాఫీ చేసే వరకూ పోరాటం చేస్తాం. జిల్లావ్యాప్తంగా భారీ వర్షాలకు చెరువులు, కుంటలు తెగిపోయి పంటలు నష్టపోయినా నష్టపరిహారం ఇవ్వకపోవడం బాధాకరం. బేషరతుగా ఆరు గ్యారెంటీలు అమలు చేయాలి.

*– మాలోత్ కవిత, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు*

## ఆ శాపమే నీకు పట్టుకుంది..



సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రంలో ఏ ఊరికైనా ముసుగు వేసుకొని రావాలి. హరీశ్‌రావు కూడా నీ వెంట వస్తడు. రైతు రుణమాఫీ పూర్తయిందా అని రైతులను అడుగు. ఆ తర్వాత ముసుగు తీస్తే రైతులే నీ పని చెప్తరు. ఎన్నికల ముందు దేవుళ్లపై ఒట్టు వేసి ఎన్నో హామీలిచ్చావు. ఇప్పుడు ఏవీ నెరవేర్చకపోవడం వల్ల ఆ శాపమే నిన్ను పట్టుకుంది. ఆరు గ్యారెంటీలు అమలుచేసే వరకూ పోరాటం ఆగదు. ఉద్యమంలో ఎలాగైతే పోరాటం చేశామో అలాగే హరీశ్‌రావుతో కలిసి 6 గ్యారెటీల అమలు కోసం పోరాటం చేస్తాం.

*– ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి*

నర్సింహులపేట(తొర్రూరు), అక్టోబర్ 4 : భారీ వరదలతో మహబూబాబాద్ జిల్లాలో పంటలన్నీ కొట్టుకుపోయి ఆగమైన రైతులను ఆదుకుంటానని మాటిచ్చిన ముఖ్యమం త్రి రేవంత్‌రెడ్డి.. నాలుగు నెలలైనా నష్టపరిహారం ఎందుకు ఇవ్వలేదో సమాధానం చెప్పాలని మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. వంట చేలలో ఇసుక మేటలు, రాళ్లు వచ్చి చేరి రైతులకు కోలుకోని దెబ్బ తగిలిందని రేవంత్‌కి రైతుల మీద ప్రేమ ఉంటే ఎంతో ఇప్పటికైనా వెంటనే సాయం అందించాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశా రు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అధ్యక్షతన శుక్రవారం పాలకుర్తి నియోజకవర్గంలో రుణమాఫీ కానీ రైతులతో తొర్రూరులో ఏర్పాటుచేసిన ధర్నాకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బస్టాండ్ నుంచి ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, ఎడ్లబడిపై ధర్నా కార్యక్రమానికి చేరుకొని ప్రసంగించారు. వరంగల్ డిక్లరేషన్ సభ లో రాహుల్‌గాంధీ ఇచ్చిన మాట ప్రకారం రైతుభరోసా రూ.15వేలు, రైతు రుణమాఫీ రూ.2 లక్షలు, రైతు కూలీలకు రూ.12 వేలు, అసైన్డ్ పట్టాదారులకు పట్టాలిస్తామని హామీలు ఇచ్చారని అవన్నీ ఎక్కడికి పోయాయని అడిగారు. ఒక పాలకుర్తిలోనే 4,314 మంది రైతులకు రుణమాఫీ కాలేదన్నారు. అలాగే మహిళలకు బతుకమ్మ చీరలకు బదులు రూ.500 ఇస్తానని చెప్పి మోసం చేశారని మండిపడ్డారు. ఎన్నికల ముందు దేవుళ్లపై ఒట్టేసి హామీలు అమలు చేస్తానని మొనగాడిలా చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి మోసగాడు అని హరీశ్‌రావు విమర్శించారు. రుణమాఫీ కాలేదని, రైతుభరోసా రాలేదని, ధాన్యానికి బోనస్ ఇవ్వలేదని ఏ ఒక్క రైతూ ఆత్మస్థైర్యం కోల్పోవద్దని హామీలన్నీ నెరవేరేదాకా బీఆర్‌ఎస్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.



రైతు ధర్నాలో రుణమాఫీ కానీ రైతుల నుంచి ఫిర్యాదు పత్రాలు స్వీకరిస్తున్న హరీశ్‌రావు

## దసరాలోపు ఇవ్వకుంటే రాహుల్ ఇంటి ముందు ధర్నా చేస్తా..

దసరా పండుగ లోపు 2లక్షల రుణ మాఫీ చేయకపోతే ఢిల్లీలో రాహుల్ గాంధీ ఇంటి ముందు ధర్నా చేస్తామని హరీశ్ స్పష్టంచేశారు. రుణమాఫీ కాలేదని డోర్నకల్‌లోని ధరావత్ తండా లో ధారవత్ రవి, దుబ్బాకలో సురేందర్‌రెడ్డిలు చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు చనిపోతుంటే కనీసం కనికరించని కేసీఆర్‌ది రైతుల గుండె అయితే రేవంత్‌రెడ్డిది రాతి గుండె అని విమర్శించారు. మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలతో నష్టపోయిన పంటలను, కొట్టుకపోయిన రోడ్లను చూసి సీఎం రేవంత్‌రెడ్డి ఫొటోలకు ఫోజులిచ్చారు తప్ప ఇప్పటి వరకు ఇస్తామన్న పరిహారం ఇవ్వలేదని అన్నారు. దేవుడిపై ఒట్లు పెట్టి మోసం చేసినందుకు రేవంత్‌రెడ్డిని క్షమించి ప్రజలను కాపాడాలని యాదాద్రి నరసింహస్వామిని వేడుకున్నానని.. అందుకు తనపై కేసులు పెట్టారని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇలా 32 కేసులు పెట్టారని అయినా వెనుకాడేది లేద ని స్పష్టంచేశారు. తెలంగాణ ఏర్పాటు కోసం 300 కేసులు పెట్టారని, ఇప్పుడు రైతుల కోసం, ప్రజల కోసం 30 కేసులు ఓ లెక్క కాదన్నారు. మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, పెద్ది సుదర్శన్‌రెడ్డి, రాకేశ్‌రెడ్డి, వాసుదేవారెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్, గాంధీనాయక్, మంగళపల్లి శ్రీనివాస్, తూర్పాటి చిన్నఅంజయ్య, శాంత, సీతారాములు, శ్రీనివాసరావు, ప్రదీప్‌రెడ్డి, ఐలయ్య ఉన్నారు.

---

## ఓపెన్ టెన్త్, ఇంటర్ దరఖాస్తుల గడువు పొడిగింపు

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 4 : తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో 2024–25 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లకు అపరాధ రుసుంతో ఈ నెల 31 వరకు అవకాశం కల్పిస్తున్నట్లు డీఈవో వా సంతి, వరంగల్ ఉమ్మడి జిల్లా ఓపెన్ స్కూల్ కో–ఆర్డినేటర్ మురాల శంకర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఓపెన్ టెన్త్, ఇంటర్మీడియట్ కోర్సుల్లో చేరేందుకు ఉమ్మడి జిల్లాకు చెందిన వారు తమ సమీపంలోని ఉన్నత పాఠశాల, జూనియర్ కాలేజీలను సంప్రదించాలన్నారు. ఓపెన్ స్కూల్ అధ్యయన కేంద్రాల్లో ధ్రువీకరణపత్రాలు సమర్పించి అడ్మిషన్లు పొందాలన్నారు. విద్యార్థులే స్వయంగా అడ్మిషన్ ఫీజు www.telanganaopenschoo l.org ద్వారా చెల్లించి రసీదు పొంది అధ్యయన కేంద్రాల్లో అడ్మిషన్ ఫారం ప్రింట్‌తో పాటు సమర్పించాలన్నారు. పూర్తి వివరాలకు 8008403631, 9396337572 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

## ఐదుగురు యువకులపై పోక్సో కేసు

జనగామ చౌరస్తా, అక్టోబర్ 4: లైంగిక దాడి కేసులో ఐదుగురు యువకులపై పోక్సో కేసు నమోదైంది. వివరాలిలా ఉన్నాయి.. దేవరుప్పుల మండలానికి చెందిన ఓ బాలిక (14)తో పాటు మల్కాజిగిరి చెందిన మరో బాలిక(15) పలు కారణాలతో సైదాబాద్ పీఎస్ పరిధిలోని పునరావాస కేంద్రంలో ఆశ్రయం పొందుతున్నారు. సెప్టెంబర్ 24న బాలికలిద్దరూ పారిపోయి జనగామకు వచ్చారు. రాత్రి కావడంతో బస్టాండ్ సమీపంలో పాన్‌షాప్ నిర్వాహకుడి వద్ద ఫోన్ తీసుకొని పరిచయం ఉన్న మరో యువకుడికి ఫోన్ చేశారు. అక్కడికి చేరుకున్న సదరు యువకుడు దేవరుప్పుల మండలానికి చెందిన బాలికను తన వెంట తీసుకెళ్లి లైంగిక దాడి చేయగా, బస్టాండ్ వద్ద మరో బాలికకు ఆశ్రయం కల్పిస్తానని నమ్మబలికిన పాన్‌షాప్ నిర్వాహకుడితో పాటు అతడి ముగ్గురు స్నేహితులు కలిసి లైంగిక దాడి చేసినట్లు సమాచారం. మరుసటి రోజు రాత్రి బస్టాండ్ దగ్గర ఒంటరిగా తిరుగుతున్న ఇద్దరు బాలికల్ని గుర్తించిన జనగామ అర్బన్ పోలీసు లు వారిని చేరదీశారు. అప్పటికే బాలికలిద్దరిపై సైదాబాద్ పీఎస్‌లో మిస్సింగ్ కేసు నమోదై ఉన్న విషయాన్ని తెలుసుకుని వారికి సమాచారం అందించారు. సైదాబాద్ పోలీసులు బాలికలను విచారించగా, వారిపై ఐదుగురు యువకులు లైంగిక దాడికి చేశారన్న విషయం తెలుసుకొని వారిపై పోక్సో కేసు నమోదు చేశారు. అనంతరం రిమాండ్‌కు తరలించినట్లు తెలిసింది.

## పిచ్చి కుక్క దాడిలో ఇద్దరికి గాయాలు

వాజేడు, అక్టోబర్ 4 : పిచ్చి కుక్క దాడిలో ఇద్దరు గాయపడిన ఘటన శుక్రవారం ములుగు జిల్లా వాజేడు మండలంలోని గుమ్మడిదొడ్డి గ్రామంలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన నల్లబోయిన బుచ్చిరామయ్య రోడ్డుపై నడిచివెళ్తుండగా పిచ్చి కుక్క అతడి చేతిపై కరిచింది. అలాగే కొప్పుసూరుకు చెందిన వేల్పుల కుటుంబారావు ముఖంపై గాయపరిచింది. వెంటనే అక్కడున్న కొందరు దానిని కొట్టి చంపారు. గాయపడిన ఇద్దరిని ఏటూరునాగారం వైద్యశాలకు తరలించారు. అయ్యవారిపేట, ధర్మవరం, ఘణపురం, జగన్నాథపురం గ్రామాల్లో పలువురు పిచ్చికుక్కల దాడిలో గాయపడిన ఘటన మరువకముందే మరో ఇద్దరు గాయపడడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

## ఏసీబీ ఇన్‌స్పెక్టర్‌ను మాట్లాడుతున్నా..

**రైడ్ కోసం మిమ్మల్ని వెంబడిస్తున్నాం..**


- డబ్బులు పంపిస్తే మా బాస్‌కు చెప్పి ఆపేస్తా..
- జనగామ జిల్లా అధికారులకు బెదిరింపు కాల్స్
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు

జనగామ చౌరస్తా, అక్టోబర్ 4 : 'హలో.. నేను ఏసీబీ ఇన్‌స్పెక్టర్‌ను మాట్లాడుతున్నా.. మీరు అధిక మొత్తంలో అసెట్స్ కలిగి ఉన్నారని మాకు ఫిర్యాదు అందింది. రైడ్ చేయడానికి మిమ్మల్ని వెంబడిస్తున్నాం. వెంటనే ఈ నంబర్‌కు ఫోన్‌పే ద్వారా డబ్బులు పంపండి.. నేను మా బాస్‌తో మాట్లాడి రైడ్ ఆపిస్తా' అంటూ జనగామ జిల్లా అధికారులకు బెదిరింపు కాల్స్ వస్తున్నాయి. ఇటీవల కలెక్టరేట్‌లో ఆర్‌అండ్‌బీ ఈఈ హుస్సేన్‌తో పాటు ఏటీవో రవీందర్‌రెడ్డి ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడిన ఘటనను ఆసరాగా చేసుకున్న ఓ సైబర్ కేటుగాడు బీసీ సంక్షేమాధికారి బీ రవీందర్‌తో పాటు ఇంటర్ విద్యాధికారి (డీఐఈవో) జితేందర్‌రెడ్డికి ఫోన్‌చేసి డబ్బులు డిమాండ్ చేసినట్లు వారు శుక్రవారం వెల్లడించారు. వారు తెలిపిన ప్రకారం.. గురువారం ఉదయం 10.30 గంటల నుంచి 11 గంటల మధ్య సెల్ నంబర్ 8464953615 నుంచి ఏసీబీ ఇన్‌స్పెక్టర్‌ను అంటూ స్పష్టమైన తెలుగులో ఓ సైబర్ కేటుగాడు ఇద్దరు అధికారులతో వేర్వేరుగా మాట్లాడాడు. ఏసీబీ అధికారులైతే చెప్పకుండానే రైడ్ చేస్తారు.. పైగా డబ్బు లు డిమాండ్ చేయరు.. ఏ రైడ్‌కైనా సిద్ధమే అని వారు చెప్పడంతో 'నేను చెప్పేది మీకు అర్థమైతలేదా' అని బెదిరిస్తూ ఫోన్ కట్ చేశాడు. అధికారులిద్దరివి ఐ ఫోన్లు కావడంతో కాల్‌ను రికార్డు చేయలేకపోయారు. ఆఫీస్ సిబ్బంది ఫోన్ ద్వారా ట్రూకాలర్‌లో నంబర్‌ను సెర్చ్ చేస్తే 'డీవీ రత్నం' అని చూపెడుతున్నదని అధికారులు పేర్కొన్నారు. కాగా, గత నెల 23న సహకారశాఖలో సీనియర్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న కుమార్‌కు కూడా 9160802941 (ట్రూ కాలర్‌లో మిస్ రోహిణి ఏసీబీ ఆఫీస్ రాంగ్) నంబర్ నుంచి రెండుసార్లు ఇలాగే ఫోన్ వచ్చినట్లు తెలిపారు. ఈ విషయాన్ని ఏసీబీ డీఎస్పీ సాంబయ్య దృష్టికి తీసుకెళ్లగా ఫేక్ కాల్‌గా నిర్ధారించినట్లు తెలిపారు. దీంతో బాధిత అధికారులు సైబర్ నేరగాడిపై జనగామ అర్బన్ పీఎస్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు.

## నూకల నరేశ్‌రెడ్డి అస్తమయం



మహబూబాబాద్, అక్టోబర్ 4(నమస్తే తెలంగాణ): సీనియర్ నాయకుడు నూకల నరేశ్‌రెడ్డి మరణించారు. సుదీర్ఘ కాలం పాటు వివిధ రాజకీయ పార్టీల పనిచేసిన అనుభవం ఆయనకు ఉంది. నూకల నరేశ్‌రెడ్డి స్వస్థలం మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెం. 1989లో కాంగ్రెస్ పార్టీ నుంచి డోర్నకల్ స్థానాన్ని ఆశించి టికెట్ దక్కలేదు. 1994లో ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చవిచూశారు అనంతరం జరిగిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో టీడీపీలో చేరారు. 1999లో డోర్నకల్ నుంచి టీడీపీ నుంచి పోటీ చేసి స్వల్ప తేడాతో ఓటమి చవి చూశారు. అనంతరం అదే పార్టీలో కొనసాగుతూ వచ్చారు. 2012 ఉద్యమ సమయంలో టీఆర్‌ఎస్ పార్టీలో చేరి 2024 వరకు పార్టీ కోసం సుదీర్ఘంగా పనిచేశారు. 2024 ఫిబ్రవరిలో ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరి ప్రస్తుతం కొనసాగుతున్నారు. జిల్లాలో సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన వ్యక్తుల్లో నూకల నరేశ్‌రెడ్డి ఒకరు. 1995లో రాయపర్తి జడ్పీటీసీగా గెలుపొందారు. నూకల నరేశ్ రెడ్డి మరణంపై జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీ నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన స్వగ్రామం పురుషోత్తమాయగూడెంలో శనివారం అంత్యక్రియలు జరగనున్నాయి.



కాసం ఫ్యాషన్స్ ప్రారంభోత్సవంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అనసూయ బరద్వాజ్

## నర్సంపేటలో కాసం ఫ్యాషన్స్..

**ప్రారంభించిన సినీనటి, యాంకర్ అనసూయ**

నర్సంపేట, అక్టోబర్ 4 : వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలో కాసం ఫ్యాషన్స్ 14వ స్టోర్‌ను సినీనటి, యాంకర్ అనసూయ భరద్వాజ్ శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అధునాతన కలెక్షన్లతో, నిత్య నూతన వెరైటీలతో కాసం ఫ్యాషన్స్ పేరు గాంచిందన్నారు. ఈ స్టోర్‌ను తాను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. నర్సంపేటకు వచ్చిన అనసూయను చూసేందుకు పెద్ద ఎత్తున అభిమానులు స్టోర్ వద్దకు చేరుకోగా ఆ ప్రాంతమంతా సందడిగా మారింది. స్టోర్ నిర్వాహకులు మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో నాలుగేళ్లుగా ప్రజల మన్ననలు పొందుతూ నూతన డిజైన్లతో కూడిన దుస్తులను గ్రామీణ ప్రజలకు తక్కువ ధరకే అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కాసం నమఃశివాయ, మల్లికార్జున్, కేదారీనాథ్, శివప్రసాద్, ఫణి, సాయికృష్ణ, ధీరజ్, డాక్టర్ ప్రీతం, యాంసాని ప్రవీణ్ పాల్గొన్నారు.

## నాలుగు ఉద్యోగాలు సాధించిన అంబాల వాసి



మెట్టుపల్లి రవీందర్

కమలాపూర్, అక్టోబర్ 4 : మండలంలోని అంబాల గ్రామానికి చెందిన మెట్టుపల్లి రవీందర్ నాలుగు ఉద్యోగాలు సాధించి యువతకు ఆదర్శంగా నిలిచాడు. కనకలక్ష్మి –మొగిలి దంపతుల కుమారుడు రవీందర్ ప్రాథమిక విద్యాభ్యాసం అంబాలలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఇంటర్ హుజూరాబాద్, బీఈడీ వ రంగల్‌లో పూర్తి చేసినట్లు తెలిపాడు. ప్రస్తు తం భద్రాచలం మైనార్టీ గురుకుల బాలుర కళాశాల–1లో సివిక్స్ లెక్చరర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఇటీవల వెలువడిన గురుకుల ఫలితాల్లో టీజీటీ, పీజీటీ జూనియర్ లెక్చరర్‌గా ఉద్యోగాలు సాధించాడు. టీఎస్‌పీఎస్సీ విడుదల చేసిన డీఎస్సీ ఫలితాల్లో సాంఘిక శాస్త్ర విభాగంలో స్కూల్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధించాడు. నాలుగు ఉద్యోగాలు సాధించడం ఆనందంగా ఉందన్నాడు. నిరంతర శ్రమే తన విజయానికి కారణమన్నాడు. ఉద్యోగ సాధనలో కుటుంబ సభ్యుల ప్రోత్సాహం మరువలేనిదని చెప్పాడు.